క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కందనూలు: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ధ్యాన్‌చంద్ అకాడమీ విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ రాజామల్లేష్ శనివారం తెలిపారు. కిడ్స్ జావలిన్ త్రో విభాగంలో కనిష్క, కిరణ్య, 300 పరుగు పందెంలో మోక్షిత, స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో లలిత్‌సుమన్ చౌహాన్, లాంగ్ జంప్ అప్రోచ్‌రన్‌లో అమిత్‌సంతోష్ చౌహాన్, 600 మీటర్స్ పరుగు పందెంలో అభినవ్‌రెడ్డి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ధ్యాన్‌చంద్ అకాడమీ క్రీడాకారులు, తల్లిదండ్రులు అభినందించారు.

అహల్యబాయి హోల్కర్‌కు నివాళి

కొల్లాపూర్: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో అహల్యబాయి హోల్కర్ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అహల్యబాయి ఎన్నో దేవాలయాలను పునర్నించారని వివరించారు. సందు రమేష్, కేతూరి నారాయణ, కాడం శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, లింగన్‌గౌడ్, కురుమయ్య, కాశీపురం మహేష్, ప్రవీణ్‌యాదవ్, కల్పనారెడ్డి, విజయలక్ష్మి, శశిరేఖ తదితరులు ఉన్నారు.

స్నాక్స్ పంపిణీ

లింగాల: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా కొనసాగుతున్న వేసవి కబడ్డీ శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న క్రీడాకారులకు శనివారం మండల వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్నాక్స్‌ను పంపిణీ చేశారు. శిబిరంలో పాల్గొంటున్న క్రీడాకారులు కబడ్డీలో మంచి మెళకువలను నేర్చుకోవాలని వాసవీ క్లబ్ మండల అధ్యక్షుడు కొత్త రామకృష్ణ కోరారు. శ్రీకాంత్, రంజిత్, వెంకటస్వామి, కృష్ణ, కోచ్‌లు అబ్దుల్లా, కంప హరీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన

కల్వకుర్తి రూరల్: దళిత విద్యార్థులను అవమానించేలా మాట్లాడిన గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణిని వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడు రామార్జున్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన నిర్వహించారు. దళిత విద్యార్థులను అవమానించిన అధికారిణిని వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు జమాలుద్దీన్, శివప్రసాద్, శివ, రాజు తదితరులు ఉన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

తెలకపల్లి: పోరాటాలతోనే సమస్యల పరిష్కారం అవుతాయని సీపీఐ మండల కార్యదర్శి వేనేపల్లి రవీందర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని చిన్నముద్దునూరులో ఆ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఘనత సీపీఐ పార్టీకే దక్కుతుందని కొనియాడారు. దీంతో వేలాది ఎకరాలకు మిగులు భూములను పంపిణీ చేశారని గుర్తుచేశారు. 1925, డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సీపీఐ ఆవిర్భవించిందన్నారు. కార్మిక కర్షక ప్రజా శ్రేయస్సుకోసం నిరంతరం ఉద్యమాలు చేస్తున్నామన్నారు. గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. విష్ణు, చంద్రయ్య, చెన్నమ్మ, బాలయ్య, బాలస్వామి, శేఖర్, అంజి పాల్గొన్నారు.

యువకుడికి రిమాండ్

కల్వకుర్తి టౌన్: పట్టణంలో యువతి మృతికి కారణమైన యువకుడికి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉండే యువకుడు ముత్యంయాదవ్ పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీలో ఉండే కృష్ణవేణితో పరిచయం ఉండటంతో తరుచుగా ఫోన్‌లో మాట్లాడేవాడు. ఇద్దరి మధ్య ఫోన్ సంభాషణలో భేదాభిప్రాయాలు రావడంతో యువతి మనస్తాపానికి గురై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. యువతి మృతిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా, యువకుడి ఫోన్ కాల్‌డేటా ఆధారంగా విచారించారు. విచారణలో యువతి మృతికి కారణమని తేల్చిన పోలీసులు యువకుడిని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లుగా ఎస్‌ఐ తెలిపారు.

భర్తపై హత్యాయత్నం

బల్మూర్: భర్తపై తల్లితో కలిసి హత్యాయత్నం చేసిన భార్య, అత్తపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రమాదేవి శనివారం తెలిపారు. మండలంలోని మహాదేవ్‌పూర్ గ్రామానికి చెందిన మల్లయ్యపై వారం రోజుల కిందట అతని భార్య దేవమ్మ, అత్త పదమ్మలు కలిసి కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ దాడిలో మల్లయ్యకు తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి సోదరి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితులను కల్వకుర్తి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాగుకు రైతులు సమాయత్తం

ఉప్పునుంతల: వానాకాలం పంటలను సాగు చేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రైతులు పొలంబాట పట్టారు. పొలాల్లో ఉన్న గత పంటల వ్యర్థాలను తొలగించడం, ట్రాక్టర్లు, ఎద్దుల అరకలతో పొలాలను దున్నుకోవడం, చదును చేసుకోవడం వంటి పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. గత వానాకాలంలో రైతులు సాగుచేసిన పంటల్లో పత్తి పంట మాత్రమే దిగుబడితోపాటు గిట్టుబాటు ధర వచ్చింది. యాసంగిలో వేరుశెనగ పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోవడంతో పెట్టుబడులు రాక రైతులు అప్పులు మూటగట్టుకున్నారు. ఈ ఏడాది వానాకాలం పంటగా పత్తిని అధిక విస్తీర్ణంలో సాగుచేయడానికి రైతులు సన్నద్ధం అవుతున్నారు. అక్కడక్కడ మొక్కజొన్న పంటను వేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. కంది పంటను అంతరపంటగా సాగుచేయడంతోపాటు అక్కడక్కడ వేరుగా సాగు చేసే ఆలోచనలో ఉన్నారు. యాసంగిలో వేరుశెనగ పంటను సాగుచేసే పొలాల్లో మొక్కజొన్న పంటను వేస్తే బాగుంటుందనే ఆలోచనలో కొంతమంది రైతులు ఉన్నారు. మండలంలో కొన్నేళ్లుగా కేఎల్‌ఐ సాగునీరు వస్తుండటంతో యాసంగి పంటగా వేరుశెనగ పంటను అధిక విస్తీర్ణంలో సాగుచేసుకునే విధంగా ముందస్తు ఆలోచనతో వానాకాలం పంటలను సాగుచేయకుండ ఖాళీగా ఉంచుతున్నారు. గతేడాది యాసంగిలో వేరుశెనగ పంట దిగుబడి రాకపోవడంతో ఈ సారి వానాకాలం పంటల సాగుపైనే రైతులు ఆసక్తి చూపుతున్నారు.



ఉప్పునుంతల శివారులో గుంటుకతో పొలం చదును చేస్తున్న రైతు

సాగుకు యోగ్యత ఉన్న భూములే అధికం

మండలంలో వ్యవసాయానికి అనువైన ఎర్రనేలలు, ఇసుకతో కూడిన తెల్ల దుబ్బ భూములు అధికంగా ఉన్నాయి. మొత్తం భూ విస్తీర్ణం 47887 ఎకరాలు ఉంది. 17178 మంది రైతులు ఉన్నారు. కొన్నేళ్లుగా ఎంజీకేఎల్‌ఐ సాగునీరు వస్తుండటంతో మండలంలో పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. మూడు, నాలుగేళ్లుగా వానాకాలం పంటల సాగుపై రైతుల ఆసక్తి అంతగా కన్పించకపోయినా వ్యవసాయాధికారులు మాత్రం 19 వేల ఎకరాల వరకు పత్తి, 6 వేల ఎకరాల్లో వరి, 600ల ఎకరాల్లో మొక్కజొన్న పంటలను సాగుచేయనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మిగిలిన కంది, మిరప తదితర పంటలు తక్కువ విస్తీర్ణంలో సాగుచేసుకునే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు.

పత్తి సాగు చేస్తా



ఈ ఏడాది వానాకాలంలో పత్తి పంటను సాగుచేస్తా. దీనికి అనుగుణంగా పొలాన్ని సిద్ధం చేశాం. గతేడాది పత్తి పంటను తక్కువ విస్తీర్ణంలో సాగు చేయగా పండిన పంటకు మంచి ధర వచ్చింది. వానాకాలం పంటకు సకాలంలో రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడి సాయం అందిస్తే స్వంతంగా విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తాం.

– గున్నమోని సైదులు, రైతు, కొత్తరాంనగర్

ఒకే పంటపై ఆధారపడొద్దు..



రైతులు ఒకే పంటపై ఆధారపడకుండ పత్తితోపాటు మొక్కజొన్న, కంది పంటలను సాగుచేసుకోవాలి. ప్రభుత్వం నుంచి ధ్రువీకరించబడిన కంపెనీలకు చెందిన నాణ్యతతో కూడిన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. వర్షాలు సమృద్ధిగా కురిసిన తర్వాత విత్తనాలు వేసుకోవాలి. తొందరపడి విత్తనాలు విత్తొద్దు. మొక్కజొన్న సాగుచేయని రైతులు కంది పంటను సాగుచేసుకోవాలి.

– రమేష్, ఏఓ, ఉప్పునుంతల

‘కళలలో ప్రావీణ్యం సాధించాలి’

కొల్లాపూర్: చదువుతో పాటు సాంస్కృతిక కళలలో విద్యార్థులు ప్రావీణ్యం సాధించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని మినీ స్టేడియంలో రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును పరిశీలించారు. పేరిణి, జానపద నృత్యాలు, సంగీతం, చిత్రలేఖనం శిక్షణా శిబిరాలను తిలకించారు. శిక్షణ అంశాల గూర్చి రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజతో చర్చించారు. మినీ స్టేడియంలోని షటిల్ కోర్టును, ఇతర వసతులను, ఆర్‌వీడీ బాలుర జూనియర్ కళాశాలను ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. టీవీలు, మొబైల్‌ఫోన్లకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. అనంతరం పట్టణం సమీపంలోని సిమెంట్ పెల్లల తయారీ కేంద్రాలను, ఇటుక బట్టీలను కలెక్టర్ సందర్శించారు. పెట్టుబటి, రాబడి అంశాల గూర్చి నిర్వాహకులతో చర్చించారు. తక్కువ ఖర్చుతో సిమెంట్, ఇటుక బట్టీలు ఏర్పాటుచేసుకుంటే మంచి లాభాలు ఉంటాయని, యువత స్వయం ఉపాధి కోసం ఇటువంటి వాటిని ఎంచుకోవాలన్నారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ అమరేందర్, జిల్లా యూత్, స్పోర్ట్స్ అథారిటీ అధికారి సీతారాం నాయక్, ఆర్డీఓ భన్సీలాల్, తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావు తదితరులు ఉన్నారు.



పెయింటింగ్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

పొగాకు ఆరోగ్యానికి హానికరం

కొల్లాపూర్: పొగాకు ఆరోగ్యానికి హానికరమని పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతుల నాగరాజు అన్నారు. శనివారం పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది హాజరై పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పోతుల నాగరాజు మాట్లాడుతూ సిగరెట్, గుట్కా, తంబాకులకు దూరంగా ఉండాలని కోరారు. పొగాకు వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు భూజల భాస్కర్‌రెడ్డి, ఆర్. కురుమూర్తి, మోహన్‌లాల్, నిరంజన్, పానుగంటి బాలస్వామి, రామలక్ష్మమ్మ పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయవాదులు

అవగాహన ర్యాలీ

మన్ననూర్: ప్రపంచ పొగాకు దినోత్సవం సందర్భంగా మన్ననూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుష్ ఆధ్వర్యంలో శనివారం గ్రామ ప్రజల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడళ్లలో వైద్య సిబ్బంది నినాదాలు చేశారు. వైద్యాధికారి జాన్సన్ మాట్లాడుతూ పొగాకు తీసుకోవడం ద్వారా కలిగే అనర్థాలు, నష్టాలను ప్రజలకు వివరించారు. వైద్యాధికారులు సుధాకర్, గౌతమ్, ఆయుష్ వైద్యాధికారిణి రాజేశ్వరి, పీహెచ్‌ఎస్ మారుతమ్మ, నారాయణమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి, తిరుపతమ్మ, జగన్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



నాగర్‌కర్నూల్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నాగర్‌కర్నూల్ క్రైం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఆయుష్ వైద్యుడు షాబాజ్ మాలిక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో యోగాపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ఆసనాలు సాధన చేయడంతో కరోనా వంటి మహమ్మారి నుంచి కాపాడిందని అన్నారు. నిత్యం యోగా చేయడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నెల 21 అంతర్జాతీయ యోగా డే పురస్కరించుకొని ఒకే భూమిక, ఒకే ఆరోగ్యం అనే నినాదంతో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ మురళి కృష్ణ గౌడ్, యోగ శిక్షకులు సాగర్, రవీందర్, అంజలి, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చారకొండలో..

చారకొండ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండల వైద్య అధికారి మంజుభార్గవి అన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మే 27 నుంచి జూన్ 21వ తేదీ వరకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని వైద్యులు, సిబ్బంది యోగా ఆసనాలు వేశారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య అధికారి గాయత్రి, వైద్య అధికారులు సృజనా, యోగా ట్రైనర్స్ దేవేందర్, కవిత, ఫార్మసిస్ బిచ్యా నాయక్, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

అచ్చంపేట రూరల్: పార్టీలకతీతంగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్‌నర్సింహ కోరారు. శనివారం అచ్చంపేటలోని టీఎన్‌జీఓ భవనంలో సీపీఐ 18వ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లమల ప్రాంతంలో ఉపాధినిచ్చే పరిశ్రమలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజీవ్ యువ వికాసం పథకం వర్తించేలా చూడాలన్నారు. ఉమామహేశ్వర రిజర్వాయర్ ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బల్మూరు మండలంలోని జినుకుంట స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన లెదర్ పార్క్‌ను అందుబాటులోకి తీసుకరావాలన్నారు. జిల్లాలో ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేసి ఉన్నత విద్యనందించాలన్నారు. కేశవ్‌గౌడ్, గోపాల్, శ్రీను, మల్లేష్, పార్వతమ్మ, పాండు, విష్ణు, బషీర్, రాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాల్‌నర్సింహ

భక్తిశ్రద్ధలతో హోమం, అభిషేకం



లింగాల: మండలంలోని దారారంలో శనివారం ఆంజనేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో బ్రాహ్మణుల మంత్రోచ్చరణ మధ్య హోమాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు కవిత శ్రీనివాసులు, టీవీ యాంకర్ చిత్రలేఖ, అశోక్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, బొందిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శంకర్‌బాబు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలి

అచ్చంపేట రూరల్: అర్హత గల జర్నలిస్టులకు సమాచార పౌర సంబంధాల శాఖలో ఉద్యోగులుగా అవకాశం కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రామచందర్, ప్రధాన కార్యదర్శి కాలూరి శ్రీను, జాతీయ కౌన్సిల్ సభ్యుడు దూమర్ల భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు ఉచితంగా విమాన ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. 20 సంవత్సరాలుగా వివిధ దిన పత్రికలలో పనిచేస్తూ అక్రిడిటేషన్ కార్డును పరిగణలోకి తీసుకుని జర్నలిజం కోర్సు చేసిన, విద్యార్హతలు కలిగిన వారికి రాత పరీక్షల ఆధారంగా సమాచార పౌర సంబంధాల శాఖలో ఉద్యోగులుగా ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

తాడూరు: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాటలో భాగంగా ఇంటింటి ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పించే సౌకర్యాల గురించి అవగాహన కల్పించారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తారని తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రచార జాత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శేషగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధారాలు లేకుండా కేసు పెట్టడం సరికాదు

నాగర్‌కర్నూల్ రూరల్: నిరంతరం ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్న బీఎస్పీ రాష్ట్ర ఈసీ మెంబర్ పృథ్వీరాజుపై పోలీసులు ప్రాథమిక అధారాలు లేకుండా కేసులు పెట్టడం సరికాదని సామాజిక ఉద్యమకారుడు వావిలాల రాజశేఖర్‌శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేదల పక్షాన నిలబడి అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టే వారిని గొంతు నొక్కే ప్రయత్నం చేయడం ప్రజా పాలన ప్రభుత్వంలో సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని వెంటనే కేసు ఎత్తేయాలని కోరారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం



ఉప్పునుంతలలో ప్రధాని నరేంద్రమోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన నాయకులు



తాడూరులో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

తాడూరు/తెలకపల్లి/ ఉప్పునుంతల/లింగాల: రైతులు పండించిన పంటలకు మద్దతు ధరను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ శనివారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో బీజేపీ శ్రేణులు, రైతులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాడూరు, తెలకపల్లి, ఉప్పునుంతల, లింగాల మండల కేంద్రాల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయా మండలాల్లో బీజేపీ నాయకులు మాట్లాడుతూ బీజేపీతోనే రైతుల సంక్షేమం సాధ్యమన్నారు. తాడూరులో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, బీజేపీ మండల కార్యవర్గ సభ్యుడు వెంకటనారాయణ, తెలకపల్లిలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కేవీ రమణారెడ్డి, మంద చెన్నారెడ్డి, నరేంద్రచారి, రాజు, కృష్ణయ్య, ఉప్పునుంతలలో బీజేపీ మండల అధ్యక్షుడు తోక్ల మహేష్‌యాదవ్, నాయకులు మండికారి బాలాజీ, శ్రీనునాయక్, సైదులు, శివశంకర్, లింగాలలో బీజేపీ మండల అధ్యక్షుడు గువ్వని నవీన్, మండల ఇన్‌చార్జ్ రమేష్‌రావు, విష్ణు, సాయిసాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలు



వెల్దండ: మండల కేంద్రంలో శనివారం బొడ్రాయి నాలుగో వార్షికోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకరించి నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బొడ్రాయికి అభిషేకం నిర్వహించారు. గ్రామ వీధులు ఆడపడుచులతో కిటకిటలాడాయి. కార్యక్రమంలో కార్యదర్శి గిరిగౌడు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తరముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి శనివారం కొల్లాపూర్ మండలం కల్వకోలుకు చెందిన దాతలు కొత్త రవీందర్‌రెడ్డి, రేణుకమ్మ నిత్యాన్నదానానికి రూ.25116లు విరాళం అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

యువతి అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: యువతి అదృశ్యమైన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్ల గ్రామానికి చెందిన పావని శనివారం జిల్లా కేంద్రంలోని పరీక్షా రాసేందుకు వెళ్లింది. ఎంతకీ తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పశువుల పట్టివేత

వెల్దండ: మండలంలోని కొట్రగేట్ వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శనివారం కంటైనర్‌లో పశువులను తరలిస్తుండగా పోలీసులు తనిఖీ చేసి 68 పశువులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా తుని నియోజకవర్గం నుంచి ప్రత్యేక కంటైనర్‌లో పశువులను హైదరాబాదు వైపు తరలిస్తున్నారు. శనివారం ఉదయం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా భారీ కంటైనర్ లారీలో 32 ఆవులు, 36 ఎద్దులు మొత్తం 68 పశువులు ఉన్నట్లు గుర్తించారు. పశువులను స్వాధీనం చేసుకొని మండలంలోని కుప్పగండ్ల సమీపంలో గురునానక్ గోశాలకు తరలించారు. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, పశువైద్య అధికారి శ్యామ్‌సుందర్ పశువులను పరీక్షించారు. డ్రైవర్లు సయ్యద్ ఉస్సేన్, కృష్ణతో పాటు యాజమానులు తారీఫ్, ఉస్సేన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ శ్యామ్ పేర్కొన్నారు.

గురుకుల కార్యదర్శిని విమర్శించడం సరికాదు

కందనూలు: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల కార్యదర్శి అలుగు వర్షిణిని విమర్శించడం సరికాదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు ఆవుల సైదులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజుల కిందట ప్రిన్సిపాల్స్ మీటింగ్‌లో గురుకుల కార్యదర్శి మాట్లాడిన వ్యాఖ్యలను వక్రీకరించడం సరికాదన్నారు. విద్యార్థులను కించపరిచే విధంగా మాట్లాడలేదని వివరించారు. గురుకుల పాఠశాలలో శానిటేషన్ కార్మికులను తొలగించలేదని శానిటేషన్ పనులు చేసేందుకు రూ.40 వేలు చెల్లించే విధంగా టెండర్లు పిలిచినట్లు వివరించారు. అసత్య ప్రచారాలు మానుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా జాయింట్ సెక్రెటరీ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకుల అరెస్టు



అచ్చంపేట రూరల్: అక్రమ అరెస్టులు సరైంది కాదని, 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్. కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం అచ్చంపేటలో టీఎస్ యూటీఎఫ్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. స్థానికులను వేరే జిల్లాలకు అలాట్‌మెంట్ చేసి వారి కుటుంబాలకు ఇబ్బంది పాలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో 317 బాధితులు సుమారు 16 మంది మరణించారని గుర్తుచేశారు. నాయకులు శంకర్, సైదులు, బాబురావు, దశరథం, బలరాం అరెస్టు చేసిన వారిలో ఉన్నారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై వారిని పోలీసులు విడుదల చేశారు.

కారు షెడ్డులో అగ్నిప్రమాదం

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న కారు షెడ్డులో అగ్నిప్రమాదం శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో మండలంలోని జీడిపల్లికి చెందిన శివభవాని కార్ మెకానిక్ షెడ్డును నిర్వహిస్తున్నాడు. ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో షెడ్డులో ఉన్న కార్లతో పాటుగా, అక్కడి వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఫైర్ ఇంజన్ సిబ్బంది మంటలు ఆర్పారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ మాధవరెడ్డి పరిశీలించి, షార్ట్‌సర్క్యూట్ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు.

భార్యను వేధించిన భర్తపై కేసు నమోదు

బల్మూర్: భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమాదేవి తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జిన్‌కుంట గ్రామానికి చెందిన నమ్రత మూడేళ్ల కిందట కర్ణాటక రాష్ట్రానికి చెందిన శ్రీనాథ్‌రెడ్డిని ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. తరుచుగా భర్త వేధించడంతో నమ్రత పుట్టింపుకి వెళ్లింది. అయినా భర్త వేధింపులు ఆగకపోవడంతో బాధితురాలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెవెన్యూ సదస్సులపై అవగాహన

కల్వకుర్తి: ఈ నెల 3 నుంచి నిర్వహించే రెవెన్యూ సదస్సులపై పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీఓ శ్రీను నాయక్ డివిజన్ పరిధిలోని రెవెన్యూ సిబ్బందికి అవగాహన కల్పించారు. శనివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. డివిజన్ పరిధిలోని కల్వకుర్తి, వెల్దండ, వంగూరు, ఊర్కొండ, చారకొండ మండలాల తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, కార్యాలయ సిబ్బంది హాజరయ్యారు.



అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ శ్రీను నాయక్

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

వెల్దండ: భూ సమస్యల పరిష్కారానికే జూన్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కార్తీక్‌కుమార్ శనివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూన్ 3న అజిలాపూర్, లింగారెడ్డిపల్లి, 4న బొల్లంపల్లి, గుండాల, 5న పెద్దాపూర్, కోనేటివాడ, 6న బైరాపూర్, పోతేపల్లి, 9న చెర్కూర్, రాచూర్, 10న కుప్పగండ్ల, కర్రెవానిపల్లి, 11న చెదురుపల్లి, కొట్ర, 12న వెల్దండ, ఎర్రవల్లి గ్రామాల్లో సదస్సులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

లింగాలలో..

లింగాల: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో ఈ నెల 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు భూ భారతి గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పాండునాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న వల్లబాపూర్, మానాజీపేట, రాయవరం, 4న రాంపూర్, అవుసలికుంట, 5న బాకారం, 6న కోమటికుంట, కొత్తకుంటపల్లి, 9న దత్తారం, అంబట్‌పల్లి, 13న శాయిన్‌పేట, 16న జీల్గుపల్లి, 17న మాడాపూర్, 18న సూరాపూర్, మగ్దూంపూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. 16 నుంచి 18 వరకు లింగాల రెవెన్యూ శివారు గ్రామాలైన అప్పాయపల్లి, పద్మన్నపల్లి, చెన్నంపల్లి, దారారం, శ్రీరంగాపూర్, ఎర్రపెంటలో గ్రామసభలను నిర్వహిస్తునట్లు వివరించారు.